# న్యాయం నవ్వుతుంది!

వడ్లమన్నాటి కుటుంబరావు




**ఫ్రెండు మేరేజీకి వెళ్ళాలని ఆదరా బాదరాగా ఆఫీసు పని ముగించాడు మధు కుర్చీలోంచి లేచి బద్ధకంగా వళ్ళు విరుచుకున్నాడు.**

డ్రాయరు తాళాలు వేసి, ఆఫీసుకు గుడ్‌బై కొట్టేసి బజారులో పడ్డాడు. వాచీ చూసుకున్నాడు. టైం అయిదుంపావయింది. ముహూర్తం సరిగ్గా రాత్రి తొమ్మిది గంటలకి. బస్‌స్టాండ్‌కేసి చకచకా నడిచాడు. అక్కడంతా కలర్ ఫుల్‌గా ఉంది. శనివారమేమో చాలా రద్దీగా ఉంది. కాంటీనులో టీ తాగి పుస్తకాల షాపుదగ్గర కాసేపు కాలక్షేపం చేశాడు. "అలా పుస్తకాలన్నీ చూసెయ్యటం మీకు న్యాయంగా ఉందాసార్!" షాపు అతను మృదువుగా మందలించాడు.

"భలేవాడివయ్యా! నేను పనీ పాటా లేకుండా నీ పుస్తకాలన్నీ తిరగేస్తున్నాననుకుంటున్నావా? నాకు కావాల్సిన "జూనియర్ సైన్స్ డైజెస్ట్" — ఎక్కడుందా అని వెదకుతున్నాను" — పరువు నిలబెట్టుకోవటం కోసం అడ్డంగా కోసేశాడు మధు.

మీక్కావలసిన పుస్తకం కోసం మిగతా పత్రికల పేజీలు ఒకటి నుంచి ఎక్స్ దాకా తిప్పటం ఎందుకు అనబోయిన షాపువాడు "సర్లే! ఓ సినీహెరాల్డివ్వు" అంటూ పర్సు తీసిన మధుని చూసి ప్రసన్నవదనంతో ఊరకుండిపోయాడు.

ఏమీ తోచక... సినీహెరాల్డ్‌లోని సినిమా బొమ్మలన్నింటినీ గిరగిరా తిప్పేశాడు. కొంపలు ముంచుకుపోతున్నట్టుగా జనం చిన్నసైజు పరుగు లాంటిది తీస్తుంటే ఏమిటా? అని ఆవేపు కుతూహలంగా చూశాడు మధు. కొంపలు మునగటం లేదుగానీ... గుంటూరు వెళ్ళే బస్సు... ప్లాట్‌ఫారమ్ దగ్గరకి వస్తోంది. చేతిలోని పత్రిక మడిచి తనూ బస్సు దగ్గరకి చేరుకున్నాడు. సినిమాహాలు దగ్గర జనం మూగినట్టుగా ఉందక్కడ పరిస్థితి. ఆడా, మగా తేడా లేదు. ఎవరి తొందర వారిది. ఊరికే అక్కడ నిల్చున్న మధు... ఆ ఒత్తిడికి... బస్సు డోరు దగ్గరికి నెట్టివేయబడ్డాడు 'ఐసవ్!' అనుకుంటూ అతిప్రయత్నంమీద బస్సు లోపలికి వెళ్ళగలిగాడు. ఏదో అనుమానం వచ్చి పాంటుజేబు తడుముకున్నాడు. పర్సు భద్రంగానే ఉంటం గమనించి విజేతలా నవ్వుకున్నాడు. కాసేపటిలో బస్సు... ఇసుకబస్తాలా నిండిపోయింది. అయాచితంగా లభిస్తున్న అతివల శరీరస్పర్శను అలవోకగా ఆనందిస్తూనే ఉన్నాడు. బస్సు బయలుదేరింది... కండక్టరు మహాశయుడు టిక్కెట్లు కొట్టగానే. ఇంతాకటినుంచీ ఉక్కపోయిన శరీరాలకి చల్లని గాలి తగలగానే హాయిగా ఉందనిపించింది. జనం లోకాభిరామాయణాన్ని పారాయణం చేస్తున్నారు. అయ్యవార్లంగారి గుర్రబ్బండీలా ప్రతిచోటా ఆగుతూ వచ్చిన బస్సు... ఎట్టకేలకు... చిట్టచివరి స్టాపు గుంటూరు చేరుకుంది. ఈసారీ మధు ఎక్కువగా కష్టపడిందిలేదు. జనం నెట్టివేసి మరీ దింపారు బస్సులోంచి.

రిక్షాలవాళ్ళు... ఆటోడ్రైవర్లు... జోరీగల్లా చుట్టుముట్టారు మధుని. విరాగ్గా ఉన్నా వాళ్ళతో బేరమాడక తప్పలేదు. పండరీపురం... ఫలానా చోటుకి వస్తావా అనడిగాడు ఓ రిక్షావాణ్ణుద్దేశించి. ఒకడికి పదిమంది జవాబు చెప్పారు... రెండు రూపాయల దగ్గరనుంచి మూడు రూపాయల వరకు ఛార్జి చేస్తూ. మూడు రూపాయల వాళ్ళని.. వద్దని... ఎలిమినేట్ చేశాడు మధు. రెండు రూపాయల వాళ్ళతో బేరమాడటం మొదలు పెట్టాడు... రూపాయిన్నర ఇస్తానంటూ. "గిట్టదు బాబూ!" అంటూ చల్లగా జారుకున్నారు వాళ్ళు 'డామిట్!' విసుక్కున్నాడు మధు.

"రండి బాబూ!" అంటూ పిలిచాడు అతనికేసి చూశాడు మధు. వాలకాన్నిబట్టి రిక్షావాలా అని తెలిసిపోతూనే ఉంది. కండలు తిరిగిన బలమైన శరీరం. కారు నలుపురంగు. ముఖం భయంకరంగా ఉన్నా... వీడని చిరునవ్వు మనిషి మంచివాడనే నమ్మకాన్ని కలిగిస్తోంది.

"ఎంత?" అన్నాడు మధు.

"మీ యిష్టం బాబూ."

"విన్నావుగా! రూపాయిన్నర ఇస్తాను."

"అట్టాగేలే బాబూ! ఎక్కండి."

ఎక్కి కూర్చున్నాడు మధు.

"బొత్తిగా బుద్ధిలేదు బాబూ!" అన్నాడు రిక్షావాలా ... జోరుగా తొక్కుతూ.

"ఎవరికి?" ఉలిక్కిపడ్డాడు మధు.

"మా రిచ్చావోళ్ళకే బాబూ."

"అమ్మయ్య!" అనుకున్నాడు మధు.

"రిచ్చా అంటే అన్నం పెట్టే కన్నతల్లి గందా! బేరం పోగొట్టుకుంటే...కంచంలో కూడు పోగొట్టుకున్నట్టు కాదాంట? పైగా ... మీరెళ్ళే సోటుకి రూపాయిన్నర సరయిన బేరం బాబూ. మా రిచ్చా వోళ్ళకి ఆశ ఎక్కువ. ఒక్కోడికి రెళ్ళు ... మూళ్ళు కావాలంట సన్నాసులు!" అంటూ రోడ్డుమీద తుపుక్కున ఉమ్మేశాడు.

రిక్షావాడిమీద ఎంతో సదభిప్రాయం కలిగింది మధుకి. రిక్షావాలా అంతా ఇంత మంచిగా ఉంటే ఎంత బాగుణ్ణు అనుకున్నాడు.

రిక్షా స్పీడుగ పోతోంది. అతనేదో చెప్పకుపోతూనే ఉన్నాడు. ఆ! ఊ! అని సమాధానాలిస్తూ ... అనాసక్తిగా వింటూనే ఉన్నాడు మధు. గుంటూరు టౌన్ లైట్లకాంతితో మిలమిల మెరిసిపోతోంది. "పెళ్ళికానుక కొనాలి. ఓ అయిదు నిముషాలు ఆపుతావా రిక్షా" అన్నాడు మధు.

"దాన్దేముంది బాబూ! అట్టాగే"—అంటూ ఆపాడు రిక్షావాలా.

అయిదు నిముషాలనుకున్నది – ప్రెజెంటేషన్ కొంటం పూర్తయ్యేసరికి పదిహేను నిముషాల పైన పట్టింది. రిక్షావాడు సణుగుతాడేమో అనుకున్నాడు మధు. అలాంటిదేమీ లేదు. "ఎల్దామా బాబూ?" అన్నాడు చిరునవ్వుతో. "ఊ" అంటూ రిక్షా ఎక్కి కూర్చున్నాడు మధు. పండరీపురం రానే వచ్చింది. కొంచెం దూరంలో మధు ఫ్రెండు ఇంటి ముందు షామియానా కింద మిరుమిట్లు కొలిపే లైట్లకాంతిలో జనం హడావుడి – పెళ్ళి సందడి గురించి చాటి చెపుతూనే ఉంది.

"ఇక్కడ ఆపెయ్యి! నీ డబ్బులిచ్చి పంపేస్తాను" అన్నాడు మధు.

# న్యాయం నవ్వుకుంది!

రిక్షాకి బ్రేకు పడింది. దిగాడు మధు. పర్సు తీసి ఓ రూపాయి కాగితం అర్ధరూపాయి బిళ్ళ ఇచ్చాడు మధు. చిరునవ్వుతో స్వీకరించాడు రిక్షావాలా. వాడి మంచితనం చూసి ముగ్ధుడయిపోయిన మధు... మర్యాద కోసం "వెళ్ళొస్తానోయ్!" అన్నాడు — పర్సు తిరిగి జేబులో పెట్టుకుంటూ. "అట్టాగే బాబూ! మాలాంటి వోళ్ళు బాగుపడాలంటే ... మీలాంటి మారాజులు సల్లగా ఉండాలి." మధుకు దాని భావం అర్థం కాకపోయినా ... తనూ ఓ చిరునవ్వు పారేసి చేతిలో కానుకతో ... పెళ్ళిపందిరి (షామియానా) కేసి బయలుదేరాడు

పెళ్ళివార తనని సాదరంగా రిసీవ్ చేసుకున్నారు. పెళ్ళి పీటలమీద కూర్చున్న అనిల్ తనని చూసి... కొండంత సంతోషాన్ని కళ్ళతోనే వ్యక్తం చేశాడు. "ముహూర్తానికింకా చాలా సేపుంది. ఈలోపుగా భోంచేద్దురుగాని రండి" అంటూ ఆహ్వానించాడు ఓ మధ్యవయస్కుడు. సరేనని ఆయనతో బయలుదేరాడు మధు. "భోజనశాల ఆవేపుంది. వీధిలోంచి వెళ్ళాలి మనం" అంటూ దారితీశాడాయన. షామియానా కిందుగా నడిచి వెళ్తున్న మధుకి "బాబుగారూ!" అన్న కేక వినిపించింది. ఆశ్చర్యంగా ఆవేపు చూశాడు. రిక్షావాలా! అతని ముఖంలో అదే చిరునవ్వు.

"ఏమిటోయ్" పలకరించాడు మధు.

చిరునవ్వే సమాధానంగా ఇచ్చాడు రిక్షావాలా.

"ఈ రాత్రికి ఇక్కడే ఉంటానోయ్. రిక్షా అక్కర్లేదు" అన్నాడు మధు.

"అదేంటి బాబూ! అలాగంటారు" అన్నాడు రిక్షావాలా. ఈసారి ఆశ్చర్యపోవటం మధు వంతయింది.

"ఏమిటోయ్!" రెట్టించాడు.

"నా బాడిగ ఇవ్వలేదుగా మీరు? మరిసి పోయారేమో పెళ్ళిగోలలో పడి అని గురుతు సెయ్య టానికి వచ్చాను" అన్నాడు రిక్షావాలా నెమ్మదిగా.

షాక్ తిన్నట్టయిపోయాడు మధు. "ఏమిటీ? నీ బాడుగ డబ్బులివ్వలేదా నేను!" అన్నాడు గట్టిగా.

"అలా దబాయిత్తారేం బాబూ? నేనేమన్నా అబద్ధం ఆడతన్నానంటారా? సిల్లరలేదు — పెళ్ళి వారిదగ్గర ఎవరి దగ్గరన్నా తీసుకొచ్చి ఇత్తా నుండ వోయ్ కాసేపు అని మీరేగా అన్నారు."

నెత్తిన పిడుగు పడ్డట్టయింది మధుకు. ఎంత ధైర్యంగా కోసేస్తున్నాడు రిక్షావాడు?!

"ఒక రూపాయి ... అర్ధరూపాయి బిళ్ళ ఇవ్వలేదూ నీకు?" జారిపోతున్న శక్తిని కూడ దీసుకుంటూ అన్నాడు మధు.

"బాబూ! సదువుకున్నోరు మీరు! ఇలా అబద్ధాలాడకండి. బాగోదు" — ఈసారి కటువుగా అన్నాడు రిక్షావాలా - తన భారీ శరీరాన్ని అటూ ఇటూ కుదుపుతూ.

ఈ చోద్యం చూట్టానికి ... అప్పుడే చాలా మంది పెళ్ళి జనం పోగయ్యారు. ఆ పరిస్థితి మధు కెంతో బాధగా తయారయ్యింది.

"ఇదుగో! రిక్షావాలా! ఆఖరుసారిగా అడుగు తున్నాను. నిజం చెప్పు. నేను నీకు రూపాయిన్నర ఇవ్వలేదూ?" అన్నాడు.

పకపకా నవ్వాడు రిక్షావాలా. "కనీసం మూడు రూపాయలయినా లేందే... ఇక్కడికొచ్చే ఎర్రిబాగుల రిచ్చావోడు ఎవరు బాబూ? నాతో రెండున్నర బేరం కుదురుసుకున్నారు. ఇప్పుడేమో... రూపాయిన్నర ఇచ్చానంటున్నారు. ఇది సాలదా బాబూ! మీరెలాంటివాళ్ళో తెలుసుకోటానికి."

"షటప్" గట్టిగా అరిచాడు మధు అసహనంగా.

"బాబుగారూ!" రిక్షావాలా కూడా గట్టిగానే అరిచాడు. జంకాడు మధు.

"నేను నా పెళ్ళాంమీద పిల్లలమీద పెమానం సేసి సెపుతున్నాను. మీరు నాకు నయాపైసా కూడా ఇవ్వలేదు. మీ కిట్టమయితే, మీకు నీతి అనేది ఉంటే ఇవ్వండి. నేదా మా రెక్కల కట్టం ఉసురు కట్టుకోండి, వెళ్ళిపోతాను. అంతేగాని.. అలా ఇంగిలీసులో తిట్టారంటే ఊరుకునేది నేదు. మీకు బాస వత్తే మాకు బూతులు వచ్చు. అయినా ఈ పూట ఇట్టాంటి సెత్తబేరం తగులుతుందనుకో లేదు" విసురుగా అన్నాడు రిక్షావాలా.

నిశ్చేష్టుడయిన మధుకి నోట మాట రావటం లేదు. అంతకన్నాబాధకలిగించే విషయమేమిటంటే.. జనం రిక్షావాడిమీదే సానుభూతి చూపించసాగారు.

"పెళ్ళి హడావుడిలో మర్చిపోయారేమో సార్! ఓ సారి గుర్తు తెచ్చుకోండి" — ఒకాయన సలహా

"భార్యా పిల్లలమీద ప్రమాణం చేసి మరీ చెపుతున్నాడు — కాస్త ఆలోచించు నాయనా! పొరపాటనేది ఎవరికయినా జరగొచ్చు" ఓ పెద్ద తలకాయ అనునయం.

"వాణ్ణి చూస్తేనే భయమేస్తోంది. అలగా జనంతో అల్లరి పనికి రాదు" — ఓ నడివయస్కుడి గుసగుస.

"ఆ రెండున్నర వాడి మొఖాన కొట్టేస్తే వాడే పోతాడుగా? ఎందుకొచ్చిన రభస?"—తనని భోజనానికి తీసుకెడుతున్నాయన —, తేల్చి పారేశాడు

పరిస్థితిని గమనించిన మధు మారు మాటాడ కుండా పర్సుతీసి రెండున్నర ఇచ్చేశాడు.

విసురుగా అందుకున్న రిక్షావాలా "తస్స జెక్క ... మా బాడుగ డబ్బులు మా కివ్వటానికి... పేనం ఓ పట్టాన ఒప్పదు...ఈ సదువుకున్నోళ్ళకి" అంటూ వెళ్ళిపోయాడు.

మధుకు తల కొట్టేసినంత పనయింది. అవమానం భరించలేకపోయాడు. అప్పుడే హడావుడిగా వస్తున్న ఓ యువకుడు "ఏమైంది!" అన్నాడు - అక్కడున్న వారి నుద్దేశించి. మధు పక్కనున్నాయన విషయం అంతా వివరించి చెప్పాడు.

పడీపడీ నవ్వసాగాడా యువకుడు. ఆశ్చర్యంగా చూశారు అందరూ అతనికేసి. వెంటనే అతను మధు చెయ్యి అందుకుని షేక్ హాండిచ్చాడు. అయోమయంగా ఉంది మధుకి.

"మిమ్మల్ని గింగిరాలు తిప్పి ... ఆటాడించిన రిక్షావాలా ... నే వొస్తుంటే ఎదురు పడ్డ నల్ల ఎలుగుబంటిగాడే కదూ" అన్నాడు.

అవునన్నారు గుంపులోంచి ఎవరో.

చిరునవ్వుతో చెప్పాడతను. "మీరేం బాధ పడకండి సార్. వాణ్ణి చూడగనే అనుకున్నాను — వీడివ్వాళ ఎవర్నో ముంచి వస్తున్నాడని. వాడిపేరు రిక్షా సింగన్న. అతి తక్కువ బాడుగకి ఒప్పుకుం టాడు ముందు. తరవాత ఈ రకమైన పేచీ పెడతాడు. ఆ ఒట్లు... గట్లు... అంతా అబద్ధమే! అసలు వాడికి పెళ్ళే కాలేదు. ఇక కాదుకూడా."

జనం నోళ్ళు తెరిచేశారు ఆశ్చర్యంతో. మధు ప్రాణం కుదుటబడ్డట్టయ్యింది. "ఇదంతా మీకెలా తెలుసు?" ఒకాయన అడిగాడు.

"భేష్! నేను చెప్పాలనుకుంటున్న విషయాన్నే మీరు ప్రశ్నగా అడిగారు. నేనూ ఓసారి ఈ సింగన్న గాడి పాలబడి ఇలాంటి అవమానాన్నే పొందాను." అన్నాడు.

"ఆఁ!" అన్నారు జనం విభ్రాంతిపోయి. "ఇందులో మీ తప్పేమీ లేదుసార్! టేకిట్ ఈజీ" అంటూ మధు భుజంతట్టి వెళ్ళిపోయాడాయువకుడు.

అతనికి మనసులోనే ధన్యవాదాలర్పించుకుంటు భోజనశాలకేసి నడిచాడు మధు. అతని మనస్సిప్పుడ ఆనందంతో తేలిపోతోంది. ★



24—12 1980న బొంబాయి విమానాశ్రయానికి వచ్చినప్పుడు మలేసియ ఆంధ్రసంఘం అధ్యక్షుడు డక్టర్ పి. అప్పారావును సన్మానించారు. ఈ చిత్రంలో లింగన్నపూజారి, మండలి వెంకటకృష్ణారావు, పి.అప్పారావు, బొంబాయి తెలుగు ఫేడరేషన్ అధ్యక్షులు డాక్టర్ఆర్.వి. నాథ్, డాక్టర్ వి. యస్. రావు, శ్రీ ఎమూర్తిరావు, శ్రీ నాగరాజా, శ్రీ గంజీశంకర్, శ్రీ నాగరాజగారలున్నారు.
—ఫొటో : మాస్టర్ రచ్చభూమేశ్వర్